


# అనల్పస్వల్పం

## పి.శ్రీనివాసశాస్త్రి

ఆకాశం నరికొత్త కరెన్సీనోటులా ఉంది.

సూరీడు రూపాయికాసల్లే ఆకాశానికి అద్దిపెట్టు అమిరాడు.

ఎండకు గుండెకాయ లేదు—ఫెళఫెళ లాడించేస్తోంది.

ఆ ఎండలో లచ్చిగాడికి, చెమట చుక్కల్లాతేలి కొంత దుస్తుల్లోకి, కొంత మళ్ళీ శరీరంలోకి ఇంకి పోతోంది. వేల రూపాయల స్కూటర్‌తో వాడివేళ్ళు ఆడుకోటం లేదు. శ్రమపడుతున్నాయి. "నాలుగువేళ్ళూ నోట్లోకి పోవాలంటే ఆటాపాటా జాన్తా నైయ్" అంటూ ఆ ఖావిఖారత పోరణ్ణి పనిలో పెట్టాడు తండ్రి. సదరు నాన్న రైస్ మిల్లు దగ్గర బస్తాలు మోస్తాడు. తల్లి అంట్లు తోముతుంది. అందేత లచ్చిగాడు పదోయేటే పెద్దాడయిపోవలసి వచ్చింది. ఏళ్ళ తరబడి మోస్తున్న బస్తాలు, తోమే అంట్లు మిగల్చలేక పోయిన సంపదని వాడిపేరులో చూసుకుని సంతోషిస్తారు తల్లీ, తండ్రీ.

లచ్చిగాడికి రూపాయి విలువ తెలుసు. వాడికి తెలుసుకాబట్టి రూపాయికి విలువ ఉండనిక్కాదు. రూపాయికి విలువ లేదని వాడికి తెలుసు ననడం సబబు.

వాడు పొరుడిగా మారి నెల పూర్తికా లేదింకా. మొదటి జీతం ముట్టలేదు.

"నాన్నోయ్.! నా జీతం వెంతేటి?" అనడిగాడు శ్రీవెంకటరమణా మోటార్ మెకానిక్స్‌లో పనికి కుదిరినరోజున.

"ఏడిశావ్ లేవోయ్.... ఎదవసన్నాసి నోర్మూసుకుని బుద్ధిగా పన్నేర్చుకోక జీతంగీతం అంటూ లెక్కలడుగుతావా? పనినించి కలకచేర్చి నేసుంటే.... ఇంకెంత పొగరెక్కిపోయి కులికేవాడివో గాని దవోరే .... నీ వన్నెప్పా కాస్కా" అంటూ తండ్రి రెండు దెబ్బలు వేసాడు.

"నచ్చినోడా.... నముంకొంటున్న కుర్రాణ్ణి బడి మాపిచ్చి పన్లో పెట్టింది కాక.... సర్దాకి ఆడు తన సెమటకి ఇలువ ఎంతో అడిగితే కొడతావా?.... నీ సేతులు లడిపోనూ" అంటూ అంట్లుతోమి అప్పుడే వచ్చినతల్లి ఓ దులుపు దులుపుతూ అంటు కడిగేసింది లచ్చిగాడి కన్నతండ్రిని.

కొడుకుని కొట్టాడని మొగుడిమీద కోపమేగాని అచ్చిగాడు పన్లోకుదిరాడని దానికి సంతోషంగానే ఉంది. ఏదో వేణ్ణీళ్ళకి చన్నీళ్ళుకాదామరి (నిజానికి కాదు మరి! ఎందేంటే- కుళాయిక్యూలో దొరికే నీళ్ళు నాలుగుబిందెలే. స్నానానికి వేణ్ణీళ్ళు పెట్టుకుంటే కలపడానికి తక్కువ చన్నీళ్ళు చాలవు. చన్నీళ్ళకి చన్నీళ్ళేగాని వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు అనడానిక్కూడా వీల్లేని సంపద వాళ్ళది!)

ఇంతకీ ఆ రోజున అలా అంటకడిగేసినందుకు లచ్చిగాడి అమ్మని వాళ్ళ నాన్న బాదేసాడు. జీతమెంతో లెక్క చెప్పమంటున్న కొడుకుని ఆడికూడ వెనకేసుకురావాన్ని రాముడు శంకించాడు. కొడుకు జీతం సారాపీళ్ళకి చీకులల్లే ఉపయోగపడాలని వాడి కోరిక. మూటలు మోసిమోసి సారా తాగితాగి చిక్కిపోతున్న తనమీద తనకే జాలీ,కోపం. అసహ్యమూనూ! అసలే అలా తన చిక్కుల్లోఉండగా లచ్చిగాడు చేయబోయే ఉద్యోగానికి ఆ వెంకటరమణా మోటార్ మెకానిక్స్ నుంచి రాబోయే జీతండబ్బుల మీద పెళ్లాం కన్నేసిందని రాముడికి అనుమానం ఒచ్చేసింది. అందుకని 'వణ్ణం' దగ్గిర కారవెయ్యలేదంటూ తగూ పెట్టుకొని పెళ్లాన్ని పీకపుచ్చుకు గుంజేసి జుట్టు గుప్పిట్లో పట్టుకొని లాగేసి నడుంవంచి వీపుమీద పిడిగుద్దులు గుద్దాడు.

'ఓలమ్మో' అంటూ అమ్మ అరుస్తుంటే 'అమ్మోఅమ్మో' అంటూ లచ్చిగాడు అరచి తండ్రికాళ్ళకి అడ్డంపడ్డాడు. అమ్మకి అమ్మలేకపోవడం, జీవకి ఉండడం, కానీ అప్పుడు తను అమ్మకి ఏమీచేయలేకపోవడం గురించి వాడు బాధపడ్డాడు. అసలు ఈ 'ఎదవగొడవ' అంతకీ కొన్ని రూపాయలు లేకపోవడమే కారణమని అనక ఆలోచించిన తరవాత వాడికి తట్టింది. తట్టగానే 'చీచీ రూపాయిలు' అని వాడు అసహ్యం పెంచుకున్నాడు. అవుంటే ఈ దెబ్బలూ, ఏడుపులూ ఏమీ లేకుండా జరుగుబాటు అయిపోతుందని కూడా వాడు మళ్ళీ ఆలోచించాడు. అవును చీచీ రూపాయిలే బలేబలే రూపాయి అని అర్థం చేసుకున్నాడు.

రూపాయికి ఉన్న విలువ (లేదా) లేని విలువ వాడికి ఆ రకంగా తెలిసొచ్చింది.

కానీ తన చెమటకి విలువెంతో మాత్రం ఆరోజున తెలిసిరాలేదు.

ఆ సంగతి తాత్కాలికంగా మరిచి పోదాం అనుకున్నాడు. కాని ఆలోచనలు అన్నింటినీ కాదని ఆ ఒక్క విషయం చుట్టూ తిరుగుతున్నాయి అదేం చిత్రమో! అప్పటినించే అందుకే వాడికి ఆకాశం కరెన్సీ నోటులాగా కనిపించడం మొదలుపెట్టింది.

ఆ వెంకటరమణా మోటార్ మెకానిక్స్‌లో చెమట ఖరీదు తెలియకుండా చెమటలు కక్కుకుంటూ పోయాడు. అక్కడ పనిలో లచ్చిగాడి సీనియర్లు ఇద్దరున్నారు. వాళ్ళకి రోజు కేటా పగలూ సాయంత్రం రెండర్థ రూపాయలు. జూనియర్ లచ్చిగాడికి పావలా, పావలా. వాళ్ళనడిగితే తెలిసింది తన జీతం ముప్పయి రూపాయలని.

"అల్ల ఆకాశంలో ఆ సూరీడు నీకెలాగా అగపడతన్నాడూ!" అని అడిగాడు కలవారి వాహనం రెక్కలు విప్పుతూ సహ సీనియర్ బాలశౌరుణ్ణి.

"మన షావుకార వాహానికి రెండు సార్లు మోటార్‌బైక్ రిపేరీకిత్తాడుసూడూ ఓ దొరబాబు. ప్రతిసారీ స్పీడోమీటర్ వందలు వందలు తిరిగిపోయుంటది. యాభై రూపాయల రిపేరీ పనికి మన షావుకారు వందడిగినా మాటాడకుండా పరుసులోంచి ఇలాగ్గాలాగి అలాగ్గా ఇచ్చేత్తాడు దొర. ఆ దొర మొకంలాగుంది ఈ సూరీడి మొకం...." అన్నాడు సీనియరు.

ఆ దొర ఎవరో గుర్తుతెచ్చుకోడానికి సూరీణ్ణి కళ్ళు చిట్లించి చూస్తూ ఆలోచించాడు లచ్చిగాడు. ఊహూ.... తట్టలేదు.

"నాకు మాత్తరం సూరీడు రూపాయి కాసులాగా అగపడతన్నాడు" బండికి తెగిన గేరువైరు లాగుతూ లచ్చిగాడు చాటాడు.

"అదేటంది!" సీనియర్ ఆశ్చర్య పోయాడు కొత్త గేరువైరు అందుకుంటూ.

పక్కన కష్టమరు అసహనంగా ఆ ఇద్దర్నీ చూస్తున్నాడు.

"నా జీతం వెంత!"

"చెప్పాగా - ముప్పయ్...."

"నెలకి రోజులెన్ని?"


"తెల్దేటి!! ముప్పయ్."

"మరి నెలకి ముప్పయ్‌సార్లు సూరీడు ఒస్తా పోతా రూపాయిస్తా పోతాడు కాదేటి?"

"అవును సుమీ!!" సీనియర్ ఒప్పుకున్నాడు.

కుర్రాళ్ళిలాగే కబుర్లాడుతూ పని తెమల్చకుండా సాగదీస్తారు. కాచోలేక కష్టమరు అవతలకి పోతాడు. అప్పుడు





తాగేస్తారు పెట్రోలు. ఈ మెకానిక్కులంతా దొంగలు!!

కష్టమర్ అలా స్వగతం చెప్పకుంటూ వాచీకేసి ముప్పయ్యోసారి చూసుకుంటుంగా మరో రెండు మోపెడ్లు, ఒక వెస్పా మూడు విక్కీలూ, నాలుగు మోటర్ సైకిళ్లూ వచ్చి ఆగాయి.

"ఏరా గేరువైరు ఎక్కించలేదేట్రా సన్నాసీ" అంటూ షావుకారు బాగైన బండిఎక్కి ట్రయలు పేరుమీద ఊరంతా తిరిగి రావడం-రావడం రావడంవిసురుగా వచ్చి సీనియర్ జుట్టు పట్టుకున్నాడు.

"తెగిన వైరు అడు లాగితేగదా నేను ఎక్కించడానికి" అంటూ లచ్చిగాడివైపు వేలుపెట్టి చూపించాడు సీనియరు.

షావుకారు లచ్చిగాడి మీదికి రంకె వేసాడు.

"నన్నా పెదవన్నరెదవా రే.... ఎన్నాళ్లా పన్నేర్చుకోడానికి." అంటూ మొలకున్న బెల్టులాగి ఝుళిపించాడు.

"ఇక ఆలస్యం ఎలాగూ అయ్యింది గాని ఈ దౌర్జన్యం దేనికి? అంతలావు తోలు పటకాతోటి కొట్టేస్తే బొట్టెడు ఏమయిపోతాడు!.... అపు.... ఆపాపు" అంటూ కష్టమరు షావుకారుకీ లచ్చిగాడికీ మధ్య అడ్డెళ్లి పొరపాట్న బెల్టుదెబ్బ తినేసాడు.

లచ్చిగాడికి దక్కాల్సిన దెబ్బ కష్టమర్‌కి తగలడంతో షావుకారు కివాలెత్తిపోయాడు.

లచ్చిగాడికి తెలిసీ తెలియని భయం ముంచెత్తి వణికిపోయాడు. అంత భయంలోనూ వాడి పదేళ్ళ వయసు తాలూకు 'అదిబుద్ర' పనిచేసింది. ఒక్క

గెంతుగెంతి అందకుండా తప్పించుకు తిరిగాడు మరమ్మత్తుకొచ్చిన బళ్ల చుట్టూ.

సీనియర్ కుర్రాళ్లిద్దరూ సంతోషిస్తూ ఒక కన్ను అటుంచి రెండో కంటినీ, రెండు చేతుల్నీ పనిమీద ఉంచారు (వాళ్ల సంతోషం జూనియర్ లచ్చిగాడు తినబోయే దెబ్బల్ని తలుచుకుని.)

ఆ పరుగులో కాలు మెలితిరిగి ఓ విక్కీని కింద పారేసాడు లచ్చిగాడు. దానికింద ఇరుక్కుపోయింది వాడి కాలు.

ఆ కాలుకి హృదయం ఉంటే, నోరుంటే అదిక్కడ తప్పనిసరిగా ఓ విషయం చెప్పేది.

'బాబుల్లారా! నేను చిల్డ్రన్ పార్కులో జారుడుబల్ల ఎక్కేడిదాన్ని కాను. ఎగ్జిబిషన్‌లో జయింట్ వీల్ కుర్చీకిందికి వేలాడినదాన్ని కాను. పోషకాహారములతో దంతపు బొమ్మలా మెరిసేదాన్ని కాను. అమ్మలూ బొమ్మలూ అబ్బురంగా చూసుకోడాన్ని ఎరిగినదాన్ని కాను. రెండుపూట్లా వేణ్ణీళ్ళ స్నానంతో సబ్బు వగిషితో శుభ్రం అబ్బినదాన్ని కాను. నా చిన్నారి యజమాని శరీరాన్ని మోయలేక చిక్కినదాన్ని. ఈ పరుగులు తీయలేను. ఇప్పుడీ విక్కీ బరువు మోయలేను. ఈ బాధలు ఇక చాలు. ఆ సంతోషాలికరావు. ఇరిగి పోనివ్వండి నన్ను...."అని ఆత్మహత్యా సదృశ్యంగా లచ్చిగాడి కాలు మొరపెట్టుకునేదే!

షావుకారు విక్కీ పైకెత్తి లచ్చిగాణ్ణి చిక్కించుకుని చెవి చేత్తో మెలిపెడుతూ 'శిక్షణ'కి ఉపక్రమించాడు.

"ఎయ్యండి సచ్చినోణ్ణి.... నాలుగు తగల్నియ్యండి.... పనిదొంగెదవ..... తిండికి దండగెదవ," అంటూ రాముడు షావుకారికి చేతులెత్తి నమస్కరించింది చాలక అరిచి మరీ చెప్పాడు. కొడుక్కి షావుకారిచ్చే బేటా రెండు పావలాల్లో అనవాయితీగా ఒకటి (బీడీముక్కలకి) దక్కించుకోడానికి అప్పుడే అక్కడికొచ్చాడు వాడు.

అసలు లచ్చిగాణ్ణి పన్లో పెట్టినప్పుడే షావుకారుకీ, రాముడికీ మధ్య వాడి జీతం, ఈ దెబ్బలూ గురించి ఓ అన్‌రిటెన్ అగ్రిమెంటు కుదిరింది.

పనోళ్లు ఆడుతూ పాడుతూ పని చేస్తామంటే కుదురుద్దా.... అందుకే అసలు ఆటా పాటా తెలీని పోరగాళ్లని పన్లో పెట్టా. పేకాటో సినిమాపాటో తెలిసిన పెద్దపెద్ద మొద్దుల్ని పెట్టానను కోండి.... ఆడు ఆటకీ పాటకీ డబ్బులు సాలక నా లాభాల్లోంచి వాటాకొట్టేస్తాడు. అదేటని నిలేస్తే అనక మరమ్మత్తుకొచ్చిన ఏదో ఓ బండిని బాగుచేసి ట్రయల్ రన్ ఏసొస్తానంటూ అదే పోక పోతాడు. అందుకే.... ఇదిగో— నీ పేరేటి, రాముడా? నీ బుడ్డణ్ణి ఉత్త పున్నేనికి రెండుదెబ్బలు వేస్తే డీజిల్ ఇంజన్లా నామీదడమాక .... ఏటీ .... పదంతా శిచ్చణ.... నీ కొడుకు బాగుపడ్డానికి నేను రెండు దెబ్బ లెయ్యాలంటే నా సెయ్యి కూడా దెబ్బ తినేద్దికాదా.... అందుకే మీ అబ్బిగాణ్ణి నాను కొట్టే దెబ్బలు ఆడికి నేనిచ్చే జీతంలో ఓ బాగం...." అని షావుకారు అనాడే చెప్పిఉంచాడు.

దెబ్బలు లచ్చిగాడికీ, డబ్బులు తనకీ దక్కేలా రాముడు ఒప్పేసుకున్నాడు. కాపీ పెధవ జీతం ఇరవైతొమ్మిది రోజులూ వెళ్లీ ముప్పయ్యోనాడు కాని చేతిలో పడదు. మధ్యలో పదీ పరకా అడిగితే షావుకారు అడ్వాన్సు ఇస్తాడు గాని వడ్డీతోసహా పిల్లగాడి జీతంలో కోస్తాడు. సంసారం ఉన్న తరవాత మోసే మూటలని నమ్ముకుంటే సారాకి ఛోకా! అంచేత అడ్వాన్సులూ తప్పవూ, వడ్డీలూ తప్పవూ. అందుగ్గాను ఆ వడ్డీ మేరకి నష్టం పూడ్చడానికి లచ్చిగాడి బేటా డబ్బుల్లో సగం ఒడుక్కుపోతాడు రాముడు.

రోజు ఆ తండ్రికి కొడుక్కీ మధ్య అనుబంధం ఖరీదు కేవలం ఒకే ఒక్క పావలా?

పదేళ్ల లచ్చిగాడు సొంత అనుభవంతో ఓ ఎక్కం కొనుక్కొన్నాడు.

"ఒక సూర్యుడు ఒక రూపాయి!

ఒక పావలాకి ఒక నాన్న.

కానీ అమ్మ వాడి ఎక్కపు రూక్కంలో ఇమడలేదు. పగటి పావలా నాన్న పట్టుకుపోయిన తరువాత ఇంటికెళ్లి అమ్మ తిని పంచిన గెంజినీళ్లు తిని (లేదా తాగి) పట్టున మళ్లా పనిలో కొచ్చేస్తాడు లచ్చిగాడు. సాయంత్రపు పావలాతో బటాణీలో, పల్లీలో, రస్కులో కొనుక్కొని తినేసి మంచినీళ్లు తాగేస్తాడు.

తను ఆడుకోకుండా పనిచేయటం దేనికి? అని ప్రశ్న వేసుకుంటే లచ్చిగాడికి సమాధానం దొరకలేదు.

రోజూ పద్దినేళ గంజినీళ్లు తినడానికి పనిచేస్తున్నాడో, పనిచేయడానికి గంజినీళ్లు తింటున్నాడో ఎంత ఆలోచించినా తట్టిందికాదు.

ప్రస్తుతం షావుకారు చెవి మెలిపెట్టడం, సీనియర్లు సంతోషించడం, కన్నమరు బెల్టుదెబ్బతిని కుదేలైపోడం, పావలాకోసం వచ్చిన కన్నతండ్రి షావుకారు చేతిలో బెల్టు తనచేతిలో లేనందుకు బాధపడుతున్నట్టు చూడ్డం— ఇన్ని ప్రమాదాల మధ్య ఇరుక్కుపోయిన తనకి విక్కీకింద నలిగినకాలు ....తెగనెప్పి....

లచ్చిగాడికి కన్నీళ్లొచ్చాయి.

ఆకాశంలోకి చూస్తే కప్పేటి చారికల్లోంచి సూరీడు చెల్లని రూపాయిలా, ఆకాశం తడిసి చిరిగిపోయిన నోటులా కనపడింది.

రూపాయి ఎన్ని బాధలు పెట్టగల్దో తెలిసొస్తోంది.

రోజుకొక్క రూపాయికే ఇన్నోటి కష్టాలయితే "సేతల ఓ నూర్రూపాయల నోటుంచేనో" అని ఓ భయం గుండెలో గుబిల్లుమంది.

షావుకారు 'శిక్షణ' యథావిధి పూర్తి చేసాడు.

నాన్న పావలా పట్టుకుపోయాడు

కష్టమరు బండికి గేరువైరు అమిరి ఐదురూపాయల నోటు షావుకారు జేబులోకి వెళ్ళిపోయింది.

కానీ—

లచ్చిగాడి చేతులకి చెయ్యాల్సిన పనీ, కాలుకి తగ్గాల్సిన నెప్పీ చాలా ఉండిపోయింది.

* * *

లచ్చిగాడు భయపడ్డంతా అయింది. వాడి చేతిలోకి నూర్రూపాయల నోటొచ్చింది.

అదెలా జరిగిందంటే—

వారానికి రెండుసార్లు రిపేరుకి బండిని పట్టుకొచ్చే దొరబాబు ఆ రోజొచ్చాడు. మారీ ఎలా ఉన్నాద్రా అని క్రితంరోజు సీనియర్నడిగితే ఈ దొరబాబు మొకంలా గుంటుందని సీనియర్ చెప్పిన సంగతి లచ్చిగాడికి గుర్తుకొచ్చింది.

ఈ దొరబాబు దొరబాబులానే ఉన్నాడు కాని సూరీడిలా మాత్రం లేడు అని లచ్చిగాడనుకున్నాడు. సూరీడు రూపాయి కాసయితే, ఈ దొరబాబు ఆ రూపాయికాసుకి తిరుగులేని ప్రొప్రేటరు లాగున్నాడు.

"అర్జంటుపనులు చాలా ఉన్నాయి. బండి పాడైపోయి పన్లన్నీ అగిపోయాయి. నిమిషాలమీద బండి రిపేరీ చేసిచ్చేయాలా" దొరబాబు తొందర పెట్టాడు.

"కాల్లో షావుకారు లేడు మరి" అని జవాబిచ్చాడు లచ్చిగాడు.

"షావుకారొచ్చే దాకా నా అర్జంటు పన్లు ఆగవు. అయ్యొచ్చేదాకా అమాన ఆగుద్దా?" దొరబాబు తొందర తొందర పెట్టేస్తున్నాడు.

"రిపేరీ అయితే మేము చేపేస్తామనుకోండి. షావుకారు సెప్పాల కదా ఎంతవుద్దో ఏటో".

దొరబాబుకి ఒళ్లు మండిపోయినట్టుంది. డబ్బంటే నాకు లెక్కలేదురోయ్ అని చెప్పడానికన్నట్లు లచ్చిగాడి మీదికి దూకి రెక్కపుచ్చుకుని చెవి మెలిపెట్టి "ఇదిగో వందనోటు అడ్వాన్సు. రెండుగంటల్లో వస్తాను. బండి రెడీగుండాల. అప్పటికి మీ షావుకారు ఒస్తే సరేసరి. రాకపోతే మరేం భయ్యంలేదు- లెక్కలూ గిక్కలూ మీ షావుకారు నేనూ చూసుకుంటాం. ఇక అందుకోండి రెంచి...." అని లచ్చిగాడి జేబులో వందనోటు కుక్కి అర్జంటు పనులు ఆగిపోయినందుకు కంగారుతోనో, మరెందుకో చెమట్లు కక్కుకుంటూ వగరుస్తూ వెళ్ళిపోయాడు దొరబాబు.

సీనియర్లూ, లచ్చిగాడూ కలిసి బండిని పెడరెక్కలు విప్పి దాన్ని శల్యపరీక్ష చేసారు.

ఇంజను స్టార్ట్ చేసాడు లచ్చిగాడు.

"తెలీటంలే.... ప్రెషర్ లీకేజీ" అన్నాడు సీనియర్.

"పిస్టన్ రింగ్సు మార్చాలా?" లచ్చిగాడులో శంకని పెట్టేసిన హుషారుతో అడిగాడు సలహా.

అద్గదీ.... కరక్టు....

బండి మరమ్మతు అయిపోయింది.

ఆ రోజు ఇద్దరు సీనియర్లలో ఒకడు డ్యూటీ దిగిపోయాడు. రెండోవాడు ఆ రోజు బేటా డబ్బులతో శ్రమని దించుకోడానికి 'కాఫీ హోటేలు'కి వెళ్లాడు.

షావుకారు రాకకోసం ఎదురుచూస్తూ షెడ్డు మొత్తానికి కాపలాగా తానుండిపోయాడు లచ్చిగాడు.

వాడిజేబులో వందరూపాల నోటు.

జేబులో వంద సూర్యుళ్లని పెట్టుకొన్నట్లు చికాగ్గా ఉంది వాడికి.

వందరూపాయలు వాడి చిన్న జీవితపు కోణంలోంచి బేరీజు వేసుకోడం చేతనే కాబోలు ఆ చికాకు.

సంతోషం కూడా చిన్నగా మొదలైంది వాడికి — వందనోటుని చేత్తో ముట్టుకున్నందుకు!

వేలు, లక్షలు, కోట్ల రూపాయల గురించి వాడు విన్నాడు.

కాని వంద రూపాయల నోటుని తన చేత్తో అందుకోడం ఇదే మొదటిసారి.

షెడ్డులోపలికివెళ్ళి అటూ ఇటూ చూసి, ఎవరూ లేరని నిర్ధారించుకుని, జేబులోంచి వందనోటు వదిలంగా బైటికితీసి గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

అప్పుడు చట్టున వాడికో సంగతి గుర్తుకొచ్చింది. ఇదివరకు ఓ సాయంత్రం వేళ తను పాకలోకి వెళ్ళినప్పుడు.... అమ్మని పక్కింటి జాపీమేస్త్రీ గట్టిగా పట్టుకుని ముద్దుపెట్టుకోడం, అమ్మ అరవకపోగా మేస్త్రీని అదిమిపట్టుకుని మరోసారి ముద్దు పెట్టించుకొని మేస్త్రీ చేతిలోంచి అబగా ఓనోటు అందుకోవం, వాళ్లిద్దరూ చూడకముందే తను పాక బైటకి గెంతి పారిపోవడం....

సరిగ్గా అప్పుడు గుండెలు ఎలా కొట్టు

కున్నాయో ఇప్పుడూ అలాగే కొట్టు కున్నాయి.

...కొంత ఆలోచిస్తే ఎందుకో తట్టింది వాడికి.

ఈ వందరూపాయలు తనవి కావు.

అలా అనుకోగానే కించిత్తు విచారం కలిగింది వాడికి.

షావుకారు కిమ్మని కష్టమరు దొర బాబు ఇచ్చాడు ఈ నోటు.

నిజానికి ఈ నోటుమీద షావుకారు పేరూ లేదు, దొరబాబు పేరూ లేదు. ఉన్నా తను చదవలేడు కాని లేదని గ్యారంటీగా చెప్పెయ్యగల్డు.

"నిజానికి ఏ నోటు ఎవడిచేతిలో ఉంటే అడిదే!" అని అనుకున్నాడు. కాదనికూడా ఈనోటుమీద రాసిలేదు. అవుననికూడా రాసిలేదని మనసు ఘోషించింది.

ఇలాటి నోటు ఒకటి తను నాన్న మొహాన పారేస్తే పావలా బేటా డబ్బులు ఒడుక్కుపోడానికి తన చుట్టూ తిరగడం ఇక మానేస్తాడా?

సరిగ్గా ఇలాటి నోటు అమ్మ మొకాని ఇసిరేస్తే మేస్త్రీకి దొంగచాటు ముద్దులూ అవీ ఇవ్వడం ఆపేస్తుందా?

పెద్దవర్షం పట్టుకున్నట్టు-

అందులో చిక్కడిపోయి తడుస్తూ నడుస్తున్నట్టు-

వడగళ్లు మొదలైనట్టు-

ఒక్కోటి ఒక్కో సూదంటు రాయిలా నెత్తిని అవి మొత్తేస్తున్నట్టు-

ఏవేవో ఆలోచనలు ముసిరేసాయి వాణ్ణి. ఈ వందరూపాయనోటుని కాగితం పడవలా చేసి ఆ వర్షపునీటిలో వదిలి అది వేగంగా పరిగెట్టినంత దూరం తాను చప్పట్లు కొడుతూ ఉరకవేసినట్టు కూడా కలగన్నాడు.

నాన్న పెద్ద రాక్షసుడి వేషంలో మూటలు మోస్తూవచ్చి ఆ మూటలన్నీ తనమీద పారేసి. ఆ వందనోటు "ఇలగిచ్చిరా! ఇలగిచ్చి" అంటూ తనచేతిలోంచి లాక్కున్నట్టు! "ఇది షావుకార్ది. కష్టమరిచ్చిన బయానా. నాను ఈ డబ్బుకి జవాబ్దారీ. నానియ్యనంటే ఇయ్యను" అని తాను పెనుగులాడినట్టు, ఈ గొడవలో నోటు చిరిగిపోయినట్టు పీడకలలాంటి ఆలోచనొచ్చింది మళ్లా.

అంతే గుండె ఝల్లుమంది!!


నోటుని భద్రంగా తడిమి అది చిరిగి పోనందుకూ, పెళపెళలాడుతున్నందుకూ సంతోషించాడు. అంతలో....

"ఏర్రా.... ఎక్కడ సచ్చావ్రా అంటాను_"

_ఓ పొలికేక వినిపించింది. ఒచ్చేసాడు షావుకారు. అందర్నీ ఇదిగో వీడే నమలి మింగేసి దొంగలా షెడ్డులో దాంకున్నాడా అన్నట్లు లచ్చిగాడికేసి పులిచూపు చూసాడు షావుకారు వస్తూనే. టౌన్లో








ఇలాంటి షెడ్లు మూడున్నాయి షావుకారికి. మూడింటినీ ఒకే లైన్లో పెట్టడానికి తిరుగుతూంటాడు.

వందరీళ్లబరువు దించేసుకునే తహతహలో జవాబ్దారీగా షావుకారుకేసి చూసి వినయంగా వందనోటుని పట్టుకుని నిలబడ్డాడు లచ్చిగాడు.

షావుకారు వచ్చినంత హడావుడిగా మళ్లీ పనిమీద బైటకి వెళ్లడానికి ఓ జావా ఎంచికొని కిక్ కొట్టాడు.

నాకు పనొచ్చేసింది. అదీగాక నిజాయితీ మనిషి నేను అని చాటుతున్నట్టు దర్పంగా కాపీ సవినయంగా లచ్చిగాడు జవాబుకి అడ్డెళ్లాడు.

"దొరబాబు బండి రిపేరీకొచ్చింది.... పిస్టన్ రింగ్స్ మార్చాం.... ఇచ్చాడు..... ఇదిగో వంద_" అంటూ నోటు చూపించాడు.

"అల్లే- అదక్కడెట్టు....మాళ్లొస్తా" అంటూ షావుకారు సర్రున దూసుకు పోయేడు బండి మీద.

ఆ వెనక పొగ దుమ్ము, ధూళితో ఉక్కిరి బిక్కిరితో పోయింది లచ్చిగాడి ప్రపంచం!

